శ్రీ

చింతామణి.

ఇదిమాసమున కొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౫.] రాజమహేంద్రవరము. [సంచిక. ౯.
మన్మథసంవత్సర ఫాల్గునమాసము.

కృతివిమర్శనము.

కాకినాడలో మ-రా-శ్రీ, కొమ్మూరి లక్ష్మీనరసింహారావు పంతులవారిచే నూతనముగాఁ బ్రకటింపఁబడుచున్న 'సుజనరంజని' యను మాసపత్రికయొక్క మొదటి రెండుసంచికలు మా కార్యస్థానము చేరినవి. పత్రికోద్దేశములనుగూర్చి పత్రికాధిపతిగా రీప్రకారము వ్రాయుచున్నారు. "పైకొదువల వారింపఁబూనియే చింతామణి లోనగు పత్రికలు ప్రకటింపఁబడుచున్నవి. ఐన నవి మితములైయున్న కతమునను, అముద్రితగ్రంథములు పెక్కులు మిగిలియున్నందునను, మామిత్రులనేకులు మమ్ముఁ బ్రోత్సాహపఱచుటవలనను, బండితులకుఁ బామరులకు స్త్రీలకు బాలురకునుగూడ నుపయుక్తముగా నుండునటులఁ బురాత నాధునిక గ్రంథములను ఆంధ్రీకరింపఁబడిన ప్రకృతి, జ్యోతిష, వేదాంత, కావ్యనాటకాలంకార శాస్త్రములను, వర్తమాన కవుల చరిత్రముల నీ 'సుజనరంజనీ' పత్రికాముఖంబునఁ బ్రతిమాసమును బ్రకటింపఁ బూని నారము" మొదటి సంచికయందు కాకినాడ కాలేజీ తెలుఁగు పండితులగు మ-రా-శ్రీ శృంగారకవి సర్వారాయఁడు గారిచే రచింపఁబడిన 'లక్షణాపరిణయ' మను కావ్యమును, కూచిమంచి తిమ్మకవి రచితమగు 'రాజశేఖర విలాసము'ను, సుగుణమణీ పరిణయము, మానవతీవిలాసమునను రెండు నూతన వచనప్రబంధములును, తేజోలేఖనమునుగూర్చి కొన్నివిషయములును బ్రకటింపఁబడినవి. స్వదేశభాషాభివృద్ధికై పాటుపడు పత్రికాధిపతిగారి యుద్యమములు నిర్విఘ్నములుగాఁ గొనసాగుఁగాత!

మదరాసు లా కాలేజీలో లేఖకులగు మ-రా-శ్రీ కర వెంకటకృష్ణయ్యగారిచే రచింపఁబడిన ౧౮౯౬ సం॥ ప్రథమశాస్త్ర పరీక్షాంధ్ర పఠనగ్రంథముల టిప్పణము మాకుఁ జేరినది. టిప్పణము వ్రాయుటలో గ్రంథకర్తగారు మిగుల శ్రమచేసి పురాతనాధునిక గ్రంథపరిశోధనఁజేసి విద్యార్థుల కుపయుక్తమగునట్టి యనేకవిషయములను ప్రచురించియున్నారు. ఇదివరలోఁ బ్రచురింపఁబడిన టిప్పణములకంటె నివి యనేక విషయములయందు విద్యార్థుల కుపయోగకరములని మేము నొక్కి వక్కాణింప నక్కఱలేదు. ౧౮౯౬వ సంవత్సరాంతమునఁ బరీక్షకుఁబోవు విద్యార్థులందరు

నీ టిప్పణముల జదివి లాభప్రాప్తులగుదురని మేము నమ్ముచున్నాము.

నరసాపురము తాలూకాలోని దొడ్డిపట్ల గ్రామవాస్తవ్యులగు మ. రా. రా. శ్రీ దొడ్డిపట్ల సన్యాసిరాజుగారిచే రచియింపఁబడిన 'సర్వవిషయ సర్వస్వసంగ్రహ' మను గ్రంథము మాకార్యస్థానముఁ జేరినది. అవతారికయందు గ్రంథకర్తగారు తమ యుద్దేశములగూర్చి యిట్లు వ్రాసియున్నారు. "పాములస్వభావాదులను, పాము కాటువలన మనుష్యుఁడు సాధారణముగ చావకుండఁ జేయు చికిత్సలను వివరముగ బోధించు పుస్తకములు దేశభాషలో తఱుచుగ లేకుండుటచే దేశమునకింత గొప్పనష్టము కలుగుచున్నది. ఇతరభాషలలోఁ గొన్ని చికిత్సలు కలిగిన గ్రంథము లక్కడక్కడ నున్నప్పటికిని, తెలుగువారి కంతయుపయోగకరములు కాకుండుటవలన నానేర్చినకొలది నీపుస్తకమును సంగ్రహరూపముగ రచింపఁ బూనుకొన్నాను." ఈగ్రంథమునందు జనోపయుక్తములగు విషయములు పెక్కులుకలవు. వలయువారు గ్రంథకర్తగారికి దొడ్డిపట్ల వ్రాసి పుస్తకముం గొనవచ్చును.

A. S.

శిల్పము.

సీ. అందఱును విధిశిల్పులే యిందుఁగాల । చక్రమునఁ బాటుపడుచుంద్రు చక్కఁగొంద
ఱల సరసకావ్యరచనలయందుఁ గొంద । ఱతిభుజబలంబు వలనైదు నట్టిపనుల.

సీ. ఎద్దివన్ముగాదిల నీచమెద్దిగాదు । తెలియఁజూడంగ నెక్కువ దేనికదియ
ఎద్దిడంబముగాఁదోఁచు నద్దితక్కు । గలుగు దానికిఁ బుష్టియుఁ బలుపొసంగు.

సీ. మనవి నిర్మించు గృహమున కనుపడఁగ । గలవు సంభారములు పెక్కు కాలమందు
నకట మన నిన్నలును నేఁడు లవనిదానిఁ । గట్టవాసముల్ దూలముల్ గా వెమనకు.

సీ. వానిఁదీరిచి దిద్దుము వానిలోన । బీఁటలును దొఱ్ఱలుంచక వెలయఁజేయు
పరుఁడు చూడఁడు గదయని నరుఁడయవ్వి । చూడఁబడవంచు నమ్మకుసుమ్మినీవు.

ఆ. తొల్లి శిల్పకుశలు లెల్లరేమఱక క । రమ్ముమఱుఁగుఁబట్లు రాణనొప్పఁ
దీర్చి దిద్దిరెలమి దేవుఁ డెల్లెడలను । గాంచుచుండునవెడి కారణమున.

సీ. అద్దిగావున వారల యట్లమనము । నాచరింతము గుహ్యబాహ్యములు రెండు
ఎందు భగవంతుఁడుండు నయ్యిల్లుచేయ । వలయు నిందుగ ననిగ నిర్మలముగాను.

సీ. కాకయుండినఁ గాలచక్రమునవిల్చు । నట్టి మన జీవనంబులయందుఁ దొఱ్ఱ
లుండు విఱిగిన సోపానముండెనేనిఁ । గాళ్లు తడఁబడుఁజుమ్మి యెక్కంగఁబోవ.

సీ. కావునను బెద్దపఱుపును లావుగలుగు । నస్థిభారముతోఁ గట్టుమయ్య నేఁడు
దానిపయి నెక్కి నిశ్చింతఁ దనదుచక్కి । రేపు గనుఁగొనఁగల దది యేపుమీఱ.

తాడూరి- లక్ష్మీనరసింహారావు.